ప్రజాశక్తి
శుక్రవారం 30 జూన్ 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

గృహ నిర్మాణ వ్యయం రూ.1800 కోట్లు

- మౌలిక వసతులకు మరో రూ.1000 కోట్లు
- 55 వేల ఇళ్లకు ఎస్‌హెచ్‌జి రుణాల అనుసంధానం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

2024 సాధారణ ఎన్నికలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న లే అవుట్‌లపై దృష్టిసారిస్తూ చకచకా ఇళ్ల నిర్మాణాలను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు 67 లే అవుట్‌లలో 96250 ఇళ్లకు ప్రభుత్వం వెచ్చించే మొత్తం రూ.1800 కోట్లుగా ఉంది. తాగునీరు, రోడ్లు, విద్యుత్, ఖాళీ ప్రదేశాల అభివృద్ధి వంటి మౌలిక వసతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1000 కోట్లును విశాఖ జిల్లాలో ఖర్చు చేసేందుకు కార్యాచరణ తీసుకుంది. జగనన్న కాలనీలను అభివృద్ధి చేసి పేద, దిగువ మధ్యతరగతి ప్రజలను త్వరితగతిన ఇళ్లల్లో దింపేందుకు నలువైపులా ఏర్పాట్లను చేసుకుంటోంది. ఒక ఇంటికి అయ్యే వ్యయం రూ.1,80,000 కాగా దీంట్లో సబ్సిడీ రూ.1.50 లక్షలుగా ఉంది. దీన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా భరించనుంది. తాజాగా నిర్మాణ వ్యయం ఒక ఇంటిపై మరో రూ.35 వేలు పెరగడంతో దీన్ని గ్రామాల్లో ఉండే స్వయం

సహాయక సంఘాల ద్వారా బ్యాంకు లింకేజీని 96 వేల ఇళ్లలో సుమారు 55 వేల ఇళ్లకు గృహ రుణాల కింద ఇప్పించే బాధ్యతలను అధికారులు పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చేవి ఏమిటి ?

జగనన్న ఇళ్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఒక సెంటు భూమి, మౌలిక మిగతా 2లో..

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

మొదటి 5లో..

కన్నబాబు వ్యూహంలో చిక్కిన బొడ్డేడ

- అధ్యక్ష బాధ్యతలతో సరిపెట్టుకోవాలని సంకేతం
- తలపోటు తప్పినట్లు ఎమ్మెల్యే అనుచరుల భావన

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని వైసిపి జిల్లా అధ్యక్ష పదవి నుంచి తప్పించి, ఆ స్థానాన్ని గవర కార్పొరేషన్ ఛైర్మన్, మంత్రి అమర్‌నాథ్ అనుచరునిగా ప్రచారం పొందుతున్న బొడ్డేడ ప్రసాద్‌తో భర్తీచేయడం వెనుక రాజకీయ వ్యూహంలేకపోలేదు. ఎన్నికలు సమీపిస్తుండడంతో నియోజకవర్గంపై కేంద్రీకరించి పనిచేయాలనన్న ఆలోచనతో తనను అధ్యక్ష పదవి నుంచి తప్పించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కోరినట్లు ధర్మశ్రీ చెబుతున్న మాటల్లో నిజమెంతో తెలీదుగానీ, యలమంచిలి నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో బొడ్డేడ బెడద లేకుండా చేసుకోవాలన్న యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు (కన్నబాబు రాజు) వ్యూహం ఫలించినట్లు బలమైన ప్రచారం సాగుతోంది. కన్నబాబు రాజుతో మిగతా 2లో..

విద్యుత్ భారాలపై
నేడు వామపక్షాల ఆందోళనలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, అనకాపల్లి

ప్రజలపై భారీగా వేసిన విద్యుత్ ఛార్జీల భారాన్ని వెంటనే రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్‌ను ప్రయివేటీకరించే కుట్రలను విడనాడాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో వామపక్షాల ఆధ్వర్యాన ఆందోళనలు చేపడుతున్నట్టు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అదానీ తదితర కార్పొరేట్ల ప్రయోజనాల కోసం సామాన్య, మధ్య తరగతి ప్రజలను, రైతులను, రాష్ట్ర ప్రయోజనాలను మిగతా 2లో..



మొదటి పేజీ తరువాయి..

గృహ నిర్మాణ వ్యయం రూ.1800 కోట్లు

సదుపాయాలు సమకూర్చనుంది. ఒక ఇంటికి సంబంధించి కేంద్రం ఇచ్చే సబ్సిడీయే పైన తెలిపినట్లు రూ.1.50 లక్షలుగా నిర్ణయించబడింది. మిగతా భూమి, తాగునీరు, రోడ్లు, వసతులన్నీ రాష్ట్ర ప్రభుత్వం, తాజాగా అదనంగా ఒక ఇంటికి పడిన రూ.35 వేలను చేరుకునేలా హౌసింగ్ అధికారులకు లక్ష్యాలను నిర్దేశించింది. డిసెంబరులోగా 50 శాతం ఇళ్లను, 2024 మార్చిలోగా మొత్తం 96 వేల పైచిలుకు ఇళ్లను పూర్తిచేసే దిశగా పటిష్ట ప్రణాళికలతో యంత్రాంగం క్షేత్రస్థాయిలో పనిచేస్తోంది. మౌలిక వసతులకు సంబంధించి విఎంఆర్‌డిఎ తాగునీరు, రహదారులు, కాల్వలు, లైటింగ్ అన్నిటినీ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఎస్‌హెచ్‌జి రుణ బాధ్యత హౌసింగ్‌దే..

స్వయం సహాయక గ్రూపుల ద్వారా మరో రూ.35 వేలను ప్రతి లబ్ధిదారుకీ రుణంగా ఇప్పించాలన్న విధానాన్ని ప్రభుత్వం తీసుకుంది. ఈ బాధ్యతలను రాష్ట్ర వ్యాప్తంగా హౌసింగ్ డిపార్టుమెంట్‌పై పెట్టడంతో కష్టమవుతోందని గృహ నిర్మాణ శాఖ సిబ్బంది వాపోతున్నారు. మేస్త్రీలు వెంట పడినా కొంతమంది అంగీకరించడం లేదని చెబుతున్నారు. విశాఖ జిల్లాలో 96 వేల ఇళ్లకుగానూ 55 వేల ఇళ్లకే ఎస్‌హెచ్‌జి అనుసంధానం జరిగింది. మిగతాది ఎలా జరుగుతుందో.. ఎప్పటికి పూర్తవుతుందో చూడాల్సిందే..!

కన్నబాబు వ్యూహంలో చిక్కిన బొడ్డేడ

సఖ్యతగా వున్నట్లు బయటకు కన్పిస్తున్నా... వచ్చే ఎన్నికల్లో యలమంచిలి నియోజకవర్గం నుంచి పోటీ చేయాలన్న ఆలోచనతో బొడ్డేడ తన ప్రయత్నాలు గట్టిగా చేస్తూనేవున్నారు. మంత్రి అమర్‌నాథ్‌కు ప్రసాద్ కొంతకాలంగా సన్నిహితునిగా మెలుగుతున్నారు. యలమంచిలి నియోజకవర్గ పరిధిలోని కొన్ని భూ వ్యవహారాల్లో అమర్‌నాథ్, ప్రసాద్ జోక్యం పెరగడంతో సిఎం దగ్గర కొన్ని రోజుల క్రితం పంచాయితీ జరిగినట్లు తెలిసింది.

యలమంచిలి నియోజకవర్గంలో బయట నుంచి జోక్యం లేకుండా, ఎవరిపని వాళ్లు చేసుకోవాలని సిఎం చెప్పినట్లు తెలిసింది. తాను పోటీ చేయాలన్న ఆలోచనలోవున్న బొడ్డేడ నియోజకవర్గంలో తన పట్టు పెంచుకొనే ప్రయత్నాలు ఆపలేదు. మంత్రి అమర్‌నాథ్ సలహాతో నియోజకవర్గంలో బొడ్డేడ గ్రూపులు నడుపుతున్నారని పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ రీత్యా అంతర్గత స్పర్ధలు కన్నబాబురాజు, అమర్‌నాథ్ మధ్య పెరుగుతున్నాయి. ఈ సమయంలో జిల్లా అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాలన్న ధర్మశ్రీ నిర్ణయం కన్నబాబురాజుకు కలిసొచ్చింది. నియోజకవర్గంలో పెరుగుతున్న అసంతృప్తిని ఎన్నికల నాటికి తగ్గించుకోవాలన్న యోచనలో ధర్మశ్రీ వున్నారు. దీంతో ఆయన తన నియోజకవర్గానికి పరిమితంకావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ఎమ్మెల్యేలకు జిల్లా పార్టీ వ్యవహారాలు అప్పగించే అవకాశం లేకపోవడంతో.. బొడ్డేడకు పార్టీ బాధ్యతలు అప్పగించి తలనొప్పి తగ్గించుకోవాలని కన్నబాబురాజు వ్యూహం పన్నారు. నియోజకవర్గంలో కేంద్రీకరించి పనిచేసే అవకాశం లేకుండా పార్టీ బాధ్యతలను ఆయనకు అప్పగించేలా చేశారని ప్రచారం సాగుతోంది. పార్టీ బాధ్యతలు అప్పగించి యలమంచిలి నుంచి పోటీ చేసే ఆలోచన లేకుండా బొడ్డేడకు సంకేతాలిచ్చినట్లు తెలిసింది. జిల్లాలో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దగలిగే సామర్థ్యం బొడ్డేడకు వుందా ? లేదా ? అనేది పక్కనబెడితే ఆయన నుంచి తలపోటు లేకుండా కన్నబాబురాజుకు చేసుకోగలిగారన్న చర్చ ఆ పార్టీలో వుంది. అయితే జిల్లా వైసిపి అధ్యక్షునిగా గతం కంటే జోక్యం పెంచుకోవచ్చని బొడ్డేడ అనుచరులు భావిస్తున్నారు.

విద్యుత్ భారాలపై నేడు వామపక్షాల ఆందోళనలు

బలిపెట్టడం ఆపాలని డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీలు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు, కార్యాలయాలు వద్ద ధర్నాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర ప్రజల క్షేమమే టిడిపి ధ్యేయం

మాట్లాడుతున్న మాజీ మంత్రి బండారు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర ప్రజల క్షేమమే టిడిపి ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ దక్షిణ ఇన్‌ఛార్జ్ గండి బాబ్జి అన్నారు. చంద్రబాబు ప్రారంభించిన భవిష్యత్తుకి గ్యారెంటీ బస్సు యాత్రలో భాగంగా గురువారం దక్షిణ నియోజకవర్గంలో బస్సుయాత్రను నిర్వహించారు. ముందుగా జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. అక్కడి నుంచి వైసిపి ప్రభుత్వం మూసివేసిన సెయింట్ పీటర్ ఎయిడెడ్ పాఠశాల వద్దకు వెళ్లి సెల్ఫీ తీసుకున్నారు. అక్కడి నుండి చెత్త పేరుకుపోయిన ఎర్రి గెడ్డ వద్దకు వెళ్లి సెల్ఫీ దిగారు. అనంతరం పూర్ణా మార్కెట్, దుర్గాలమ్మ గుడి, జగదాంబ కూడలి మీదుగా పార్టీ జిల్లా కార్యాలయానికి బస్సు యాత్ర చేరింది. సాయంత్రం జగదాంబ జంక్షన్, కలెక్టరేట్, అక్కడ నుంచి ఫిషింగ్ హార్బర్ మీదుగా బస్సు యాత్ర సాగి పాత పోస్టాఫీస్ వద్దకు చేరింది. అక్కడ బహిరంగ సభ జరిగింది. సభలో గండి బాబ్జీ మాట్లాడుతూ నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సంక్షేమం కుంటుపడిందని విమర్శించారు. బస్సు యాత్రలో మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, కొండ్రు మురళీ మోహన్, పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పాల్గొన్నారు.

చెత్త పన్ను వసూలు బాధ్యత నుంచి తప్పించాలని..

పర్యావరణ కార్యదర్శుల ధర్నా

ధర్నా చేస్తున్న పర్యావరణ కార్యదర్శులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గ్రామ వార్డు, సచివాలయ వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుంచి వార్డు సచివాలయాలలో పనిచేస్తున్న సుమారు 3500 మందికిపైగా వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులకు చెత్త పన్ను వసూలు బాధ్యత అప్పగించారని, ఆ బాధ్యత నుంచి తప్పించాలని, తమ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 423ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పలువురు పర్యావరణ కార్యదర్శులు ధర్నా చేపట్టారు. 423 జిఒ కాపీలను దగ్ధం చేశారు.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శానిటేషన్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీస్ అసోసియేషన్ విశాఖపట్నం అధ్యక్షులు పి.పార్థసారథి, కార్యదర్శి డబ్ల్యు.పీటర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆడారి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ చెత్త పన్ను, యూజర్ ఛార్జీలు వసూలు విషయంలో అధికారులు లక్ష్యాలు విధించి వేధిస్తున్నారని తెలిపారు. మిగతా సచివాలయ సిబ్బంది వలే తమకు కూడా ఒక పని సమయాన్ని నిర్ణయించాలన్నారు. చెత్త పన్ను వసూలు చేయలేదని 12 మందిపై సస్పెన్షన్ వేటు వేశారని, తక్షణమే దాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 45 నెలలుగా శానిటేషన్ కార్యదర్శులు, ముఖ్యంగా మహిళా ఉద్యోగులు ప్రతిరోజూ తెల్లవారుజామున ఐదు గంటలకే సచివాలయ పరిధిలో విధులు నిర్వహిస్తూ తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని వాపోయారు.

రియల్టర్ కిడ్నాప్ కేసు ఛేదన

నలుగురు అరెస్టు, ఒకరు పరారీ

కేసు వివరాలు వెల్లడిస్తున్న సిపి త్రివిక్రమ వర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో బుధవారం సాయంత్రం జరిగిన కిడ్నాప్ కేసును గంటల వ్యవధిలోనే పోలీసులు ఛేదించినట్టు నగర పోలీస్ కమిషనర్ సిఎం త్రివిక్రమ్ వర్మ తెలిపారు. కేసు వివరాలను గురువారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. విశాఖపట్నం ఫోర్త్ టౌన్ పరిధిలోని అక్కయ్యపాలెం ప్రాంతంలో చరణ్ గ్రూప్ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేస్తున్న పట్నాల శ్రీనివాస్‌రావు, అతని భార్య లోవలక్ష్మిలను ఐదుగురు వ్యక్తులు రెండు కార్లలో బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో కిడ్నాప్ చేశారు. యలమంచిలి మండలం కొక్కిరాపల్లి వద్ద కాలకృత్యాల కోసం ఆగిన సమయంలో బాధితులు ఇద్దరు కారు దిగి రక్షించాలని కేకలు వేయడంతో లోవలక్ష్మిని వదిలిపెట్టి శ్రీనివాసరావును తీసుకొని నిందితులు పరారయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు అనకాపల్లి ఎస్‌పి సహకారంతో వారిని అరెస్టు చేశారు. ఈ కేసులో బాధితుడు పట్నాల శ్రీనివాసరావు గతంలో ఎంకె కన్‌స్ట్రక్షన్ పేరిట ఒక రియల్ ఎస్టేట్ బ్రోకర్ సంస్థను ఏర్పాటు చేశారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో సదరు సంస్థ కార్యకలాపాలు నిలిచిపోయాయి. అయితే అప్పటికే అడ్వాన్సులు చెల్లించిన 39 మంది విజయవాడ పడమట పోలీస్ స్టేషన్‌లో అతనిపై ఫిర్యాదు చేశారు. దీంతో 11 నెలల జైలు శిక్ష పడింది. అనంతరం రావులపాలెంలో సత్య సౌధ అనే స్వచ్ఛంద సంస్థలో వాలంటీర్‌గా చేరి బండారు వీర మణికంఠ అనే వ్యక్తి దగ్గర రూ.20 లక్షలు తీసుకొని చెల్లించలేదు. ఈ క్రమంలో రావులపాలెంలో అతనికి నగదు ఇచ్చిన వీర మణికంఠ, అతని ఐదుగురు అనుచరులు కలిసి రెండు కార్లలో వచ్చి శ్రీనివాసరావు కుటుంబాన్ని కిడ్నాప్ చేశారు. లోవలక్ష్మితో అసభ్యంగా ప్రవర్తించారు. ఈ కేసులో కిడ్నాప్‌కు యత్నించిన ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడకు చెందిన గ్రంధి బ్రహ్మయ్య, సింగంరెడ్డి ప్రదీప్ రెడ్డి, కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన కొమవరపు సాయి నిఖిల్, కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన బండారి వీర మణికంటలను అరెస్టు చేశారు. మరొక నిందితుడు సున్నీ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అలాగే కిడ్నాప్‌కు గురైన శ్రీనివాసరావుపై పలు ఛీటింగ్ కేసులూ ఉన్నాయి.

ఎంపీ కుటుంబం కిడ్నాప్ కేసులో 11 మంది అరెస్టు

నగరంలోని పిఎం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 15న సంచలనం సృష్టించిన విశాఖపట్నం ఎంపీ ఎంవివి సత్యనారాయణ కుటుంబ సభ్యుల కిడ్నాప్ కేసులో ఇప్పటివరకు 11 మందిని అరెస్టు చేసినట్టు సిపి త్రివిక్రమ వర్మ తెలిపారు.

ఈ కేసులో నిందితులు బాధితుల నుంచి వసూలు చేసిన రూ.కోటీ 76 లక్షలా 93 వేలు, రెండు బంగారు ఉంగరాలు, ఆరు ఐ ఫోన్లు, ఏడు వాచీలు, ఆడీ కారుకుగాను రూ.కోటీ 42 లక్షలా 72 వేలా 170, రెండు బంగారు ఉంగరాలు, ఐ ఫోన్లు- 6, వాచీలు - 7, ఆడీ కారును స్వాధీనం చేసుకున్నట్టు సిపి వెల్లడించారు.

టిడిఆర్ వద్దు

నినాదాలు చేస్తున్న బంగారు వర్తకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మెయిన్ రోడ్డు విస్తరణలో నిర్మాణాలు కోల్పోతున్న తమకు కోల్పోయిన మేరకు నష్టపరిహారంగా జివిఎంసి టిడిఆర్ ఇస్తోందని, ఇది తమకు ఆమోదయోగ్యం కాదని బంగారం వర్తక సంఘం అధ్యక్షుడు మారోజు శ్రీనివాస్ అన్నారు. గురువారం టౌన్ కొత్త రోడ్డు జంక్షన్‌లో బంగారు వర్తకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిఆర్‌ను తాము వేరొకరికి అమ్ముకుంటే.. అందులో పేర్కొన్న విలువ కంటే సగం కూడా రాదన్నారు. ఈ నేపథ్యంలో 2013 భూసేకరణ చట్టం మేరకు నగదు రూపంలో నష్టపరిహారం చెల్లించాలన్నారు. మెయిన్ రోడ్డు విస్తరణకు, అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి సుధ, నాయకులు అలమండ శ్రీనివాసరావు, అంబికా ప్రసాద్, శంకరరావు పాల్గొన్నారు.

టమోటా ధరకు రెక్కలు..

- పలమనేరు, మదనపల్లి నుంచి దిగుమతి..
- రవాణా చార్జీలు కలిపి తడిసి మోపెడు
- కిలో రూ.100కు విక్రయాలు
- భీమిలి డివిజన్‌లో ఇప్పుడిప్పుడే వేస్తున్న పంట

తగరపువలస మార్కెట్‌లో టమోటా అమ్మకాలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక ప్రయివేట్ మార్కెట్‌లో టమోటా ధర కిలో రూ.100 పలుకుతోంది. సీజన్‌తో సంబంధం లేకుండానే కర్నూలు, ప్రకాశం, చిత్తూరు, రాయలసీమ ప్రాంతాల్లో టమోటా పంటనే కాదు ప్రతి పంటనూ అక్కడి రైతులు పండిస్తారు. అక్కడున్న సాగు నీటి వనరులు, పంట వేసే పద్ధతులు ప్రత్యేకమనే చెప్పాలి. మార్కెట్‌లో అవసరాలు, డిమాండ్‌కు అనుగుణంగా ఆయా ప్రాంత రైతులు పంటలు సాగు చేస్తారు. స్థానికంగా ఉన్న అవకాశాలు, సాగు నీటి వనరులు ఆధారంగా ఇక్కడి రైతాంగం అందుకు భిన్నంగా ఆలోచిస్తారు. ఏది ఎలా ఉన్నప్పటికీ టమోటా ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో వినియోగదారులపై ఆర్థిక భారం పడుతోంది. పలమనేరు, మదనపల్లి, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి లారీల ద్వారా టమోటా బాక్సులు తగరపువలస వస్తాయి. ఇక్కడి వ్యాపారులు వాటిని కొనుగోలు చేస్తారు. రవాణా చార్జీలు సైతం కలుపుకుని వ్యాపారులు టమోటాకు ధర కట్టి అమ్ముతున్నారు. అనివార్యంగా ధర పెరుగుతుంది కూడా. 3 రోజుల క్రితం కిలో టమోటా రూ.90 ఉండగా, ప్రస్తుతం రూ.100 అయింది. దీంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి కూరలో టమోటా వేయడం అలవాటుగా మారింది. దీంతో టమోటా వినియోగం పెరిగింది.

భీమిలి డివిజన్‌లో ఇప్పుడిప్పుడే ప్రారంభమైన టమోటా సాగు

భీమిలి డివిజన్‌లో ఇప్పుడిప్పుడే టమోటా పంట సాగు ప్రారంభమైంది. డివిజన్ పరిధిలో సుమారు 300 ఎకరాల్లో ఇక్కడి రైతులు టమోటా సాగు చేస్తున్నారు. పద్మనాభం మండలం అనంతవరంలో దాదాపు 90 ఎకరాలు, కొవ్వాడలో సుమారు 50 ఎకరాలు, ఆనందపురం మండలం ముకుందపురం, వేములవలస, భీమిలి మండలం చిప్పాడ, మజ్జిపేట, లక్ష్మీపురం, సింగనబంద, దాకమర్రి గ్రామాల్లో టమోటా పంట సాగు చేస్తున్నారు.

సీజన్‌తో పని లేకుండా ఇతర ప్రాంతాల్లో సాగు

కాయ కిందకు వేలాడ కుండా పందిళ్ళు వేసి టమోటా పంట పండిస్తారు. రాయలసీమ ప్రాంతాల్లో ట్రెల్లీమ్ పద్ధతిలో నిటారున కర్రలు వేసి టమోటా పంట పండిస్తారు. పంట సాగులో అక్కడ, ఇక్కడ కొంత సారూప్యత ఉన్నప్పటికీ డిమాండ్ ఆధారంగా సీజన్‌తో సంబంధం లేకుండానే ఆయా ప్రాంతాల్లో టమోటా తదితర పంటలు సాగు చేస్తారు.

పచ్చి మిర్చి కూడా శతకం దాటింది..

నిన్న మొన్నటి వరకూ కిలో రూ.80 ఉన్న పచ్చి మిర్చి ధర గురువారం నాటికి ఏకంగా రూ.125 దాటింది. ఇతర కూర గాయల ధరలు కూడా పెరిగాయి.

వారం రోజుల క్రితం ఉన్న ధరలను, ప్రస్తుత ధరలను పోల్చి చూస్తే.. వంకాయలు కిలో రూ.50 నుంచి రూ.10 పెరిగి రూ.60కి చేరింది. బీర రూ.40 నుంచి రూ80కి పెరిగింది. బరబాట కూడా కిలో రూ.80 పలుకుతోంది. దొండ, బెండ రూ.40 నుంచి రూ60కి పెరిగాయి.

కొనలేకపోతున్నాం

టమోటా ధర వింటేనే ఆందోళనగా ఉంది. కిలో రూ100కి కొనడం సామాన్యులకు ఆర్థికంగా ఇబ్బంది.

సంధ్య
తగరపువలస

వాడుక తగ్గించుకున్నాం

గతంలో వారానికి, పది రోజులకు 2 కిలోల టమోటా కొనే వాళ్ళం. ధర పెరగడం వల్ల ఇప్పుడు వాడుక, కొనుగోలు తగ్గించుకున్నాం

పద్మ
తగరపువలస

నేరాలు ఘోరాలు

థాయిలాండ్ యువతులపై దాడి కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - ఆరిలోవ : థాయిలాండ్‌కు చెందిన యువతులతో గుట్టు చప్పుడు కాకుండా ఓ హోటల్‌లో వ్యభిచారం చేయిస్తూ మాట వినలేదని ఇద్దరు థాయిలాండ్ యువతులపై దాడి చేసిన కేసులో సూత్రదారి అయిన మహేష్‌ను ఆరిలోవ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 7న పాతడైరీఫారం, ఆదర్శనగర్‌లో ఆరంజ్ ఇన్ హోటల్‌లో గుట్టుచప్పుడు కాకుండా ఇద్దరు థాయిలాండ్‌కు చెందిన ఇద్దరు యువతులు, అరుకు ప్రాంతానికి చెందిన మరో యువతితో వ్యభిచారం చేయిస్తూ, అడ్డుతగలిన థాయిలాండ్ యువతుల పాస్‌పోర్టు తీసుకొని, వారిపై చేయిచేసుకున్న మహేష్ అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. పరారీలో ఉన్న మహేష్‌ను గురువారం ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

25కె బస్సును రెండు ట్రిప్‌లు నడపాలి

ప్రజాశక్తి -ఆనందపురం : విశాఖపట్నం-కుసులవాడ ఆర్‌టిసి బస్సు 25కెను రెండు ట్రిప్పులు నడిపేటట్లు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. విశాఖపట్నం నుంచి కుసులవాడ గ్రామానికి ఆర్‌టిసి బస్సు ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో వస్తోంది. ఈ బస్సు ఆధారంగా ఆనందపురం పరిసర ప్రాంతాలలో సుమారు 20 గ్రామాల ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు విశాఖకు రాకపోకలు సాగిస్తున్నారు. సాయంత్రం పూట తిరుగు ప్రయాణానికి బస్సు లేకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. రెండుపూటలా సమయానికి బస్సులు వస్తే సుదూర ప్రాంతంలో ఉన్న కుసులవాడ, గొల్లలపాలెం, గొట్టిపల్లి, చందక, పొడుగుపాలెం, ఆనందపురం తదితర గ్రామాల్లో ఉన్న విద్యార్థులకు, వ్యాపారస్తులకు, గ్రామస్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

ప్రతిరోజూ ఉదయం ఐదు గంటలకు రైతులు ఆనందపురం, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు కూరగాయలను ఆటోలపై తరలిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. కాయగూరలు తరలించడానికి తెల్లవారుజాము నాలుగు గంటలకు బస్సు సౌకర్యం కల్పిస్తే రైతులు ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండదని గ్రామానికి చెందిన వైసిపి నాయకులు శినగం దాము పేర్కొన్నారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సహకారంతో 2022 మే 8వ తేదీ నుంచి ఆర్‌టిసి బస్సును ప్రారంభించారని ఆయన తెలిపారు. అప్పటి నుంచి బస్సు రావడంతో కొంతవరకు ఆనందం వ్యక్తం చేసినా ఒక్కసారే రావడంతో కొంత ఇబ్బందులు తప్పడంలేదని ఆయన పేర్కొన్నారు. రెండు పూటలా బస్సు సౌకర్యం కల్పిస్తే రైతులు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు.

ఘనంగా ముత్యమాంబ జాతర

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ, శివాజీనగర్ -2లో ముత్యమాంబ అమ్మవారి జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచే ఆరిలోవ కాలనీ, రామకృష్ణాపురం, పెదగదిలి, చినగదిలి, సంతపాలెం తదితర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన రేలారే రేలా జానపద నృత్యాలు, పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు పిల్లి వీర్రాజు, కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గిరి ప్రదక్షిణ సౌకర్యాలపై సమావేశం

ప్రజాశక్తి-సింహాచలం: గిరి ప్రదక్షిణ రోజున బాలలకు 32 కిలోమీటర్ల ప్రాంతంలో కల్పిస్తున్న సౌకర్యాలపై దేవస్థానం అధికారులతో గురువారం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సమావేశమై చర్చించారు. గిరిప్రదక్షిణ జరిగే ప్రదేశంలో చిన్నారులకు పాలు, బిస్కెట్లు, విశ్రాంతి తీసుకునేందుకు సౌకర్యాల కల్పన కొన్ని అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం, కుమారి, ఆదిలక్ష్మి, దేవస్థానం అధికారులు శ్రీనివాసరాజు, సుజాత, ఎఇఒ భ్రమరాంబ పాల్గొన్నారు.

స్వాతి నక్షత్ర హోమంలో 39 జంటలు

ప్రజాశక్తి-సింహాచలం : స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని గురువారం అర్చకులు అత్యంత వైభవంగా హోమం నిర్వహించారు. ఈ హోమంలో 39 జంటలు పాల్గొన్నాయి. హోమం అనంతరం ప్రసాదాన్ని పాల్గొన్న జంటలకు అర్చకులు అందించారు.

సింహగిరి కిటకిట

ప్రజాశక్తి-సింహాచలం: గురువారం తొలి ఏకాదశి కావడం, బక్రీద్ సెలవు రావడంతో సింహగిరి భక్తులతో కిటకిటలాడింది. భక్తులు దర్శనానికి అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. దర్శనానంతరం ప్రసాదాలకు కూడా అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. భక్తుల రద్దీ దృష్ట్యా మంత్రాలయంలో ఎటువంటి ప్రత్యేక పూజలు నిర్వహించలేదు.

12వ వార్డులో టిడిపి మ్యానిఫెస్టోపై ప్రచారం

టిడిపి మేనిఫెస్టోను ప్రచారం చేస్తున్న ఆ పార్టీ నాయకులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇటీవల మహానాడులో తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోను స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు 12వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యాన గురువారం శ్రీలీలాసుందరయ్యనగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ, సూపర్ -6 మేనిఫెస్టోను ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీచేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే పథకాల గురించి స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గాడి సత్యం, ఏడువాక సన్యాసిరావు, ఒమ్మి పోలారావు, మీసాల సత్తిబాబు, బండారు శంకరరావు, తిమోతి, కొత్తల గోపాల్, దువ్వి తాతారావు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి నిత్యావసరాలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అలంక వీధిలో ఉన్న పేద కుటుంబానికి స్థానికులు భవానీప్రసాద్ ఆర్థిక సాయంతో గురువారం నిత్యావసరాలు అందజేశారు. కుమార్తె కుందనశ్రీ పుట్టిన రోజు సందర్భంగా ఈ మేరకు సేవా కార్యక్రమం తలపెట్టారు. ఇందుకు గాను పలువురు అతన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో 1991-92 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు ఎస్.శ్రీనివాసవర్మ, హేమ, జి.సురేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న భవానీప్రసాద్

అప్పన్నను దర్శించుకున్న జిల్లా జడ్జి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను గురువారం జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వీరికి ఆలయ పర్యవేక్షకులు పాలూరి నర్సింగరావు స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

రీసైకిల్ సెంటర్‌ను సందర్శించిన జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి -మధురవాడ : అభివృద్ధి, పర్యావరణ నియంత్రణ కోసం రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ సెంటర్లు ఎంతో ఉపయోగపడతాయని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. గురువారం ఆయన నగరంలోని ఎండాడ, తగరపువలస, గాజువాక, పెందుర్తి తదితర ప్రాంతాలలోని పలు త్రిబుల్ ఆర్ సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ సెంటర్ల ద్వారా ఎంతో ఉపయోగముందన్నారు. తక్కువ వినియోగం, పునర్వినియోగం, శుద్ధి చేసి వినియోగం (త్రిబుల్ ఆర్)పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రీసైకిల్ ద్వారా పిల్లలకు పనికొచ్చే ఆట వస్తువులతోపాటు అనేక వస్తువులు తయారుచేయవచ్చన్నారు.

చట్టివానిపాలెంలో రోడ్డు ఆక్రమణ

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 70వ వార్డు పరిధి చట్టివానిపాలెంలో రహదారి ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ, జివిఎంసి అధికారులు పట్టించుకోవడం లేదు. శివాలయం గుడి ఎదురుగా చట్టివానిపాలెం జాతీయ రహదారి వరకు పాత రహదారి ఉంది. దీనిని విస్తరించాలని గతంలో అధికారులు సీసీ రోడ్డు కూడా వేశారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండతో బ్రోకర్లు ఆ రహదారిలో భూమికి తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించి వారం రోజులుగా నిర్మాణం చేస్తున్నారు. అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధి అండ ఉండడంతో అధికారులు చర్యలు సాహసించడం లేదు. ఈ రోడ్డు కబ్జాకు గురవడం వల్ల అంబులెన్స్, మరే ఇతర వాహనాలు వెళ్లడానికి అవకాశం ఉండదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారి గుండా నిత్యం జనసంచారం, వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ రోడ్డును విస్తరిస్తే 70వ వార్డుతో పాటు ఆటోనగర్ ప్రజలు రాకపోకలకు అనుకూలంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

దీనిపై గాజువాక తహశీల్దార్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఆ ప్రాంతానికి తమ సిబ్బందిని పంపిస్తున్నట్లు తెలిపారు.

స్పందనలో ఫిర్యాదు

ఈ రోడ్డు ఆక్రమణకు సంబంధించి జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశామని స్థానిక కమిటీ నాయకులు చట్ల అప్పారావు తెలిపారు. రోడ్డు కబ్జా కాకుండా మళ్లీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

చట్టివానిపాలెంలో రహదారిని ఆక్రమించి కడుతున్న నిర్మాణం

ఓటమి భయంతోనే
పవన్‌పై జగన్ వ్యక్తిగత విమర్శలు

ప్రజాశక్తి-సీతమ్మధార: ఓటమి భయంతో పవన్ కల్యాణ్‌పై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేస్తూ, వారాహిపై మాట్లాడుతున్నారని జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు ఆరోపించారు. గురువారం పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్వతీపురం మన్యంజిల్లా కురుపాం సభలో ఓటమి భయంతో అసహనం, అహంకారంతో పవన్ కల్యాణ్‌పై జగన్మోహన్‌రెడ్డి విమర్శలు చేశారన్నారు. ప్రభుత్వ సొమ్ముతో అమ్మ ఒడి పథకం కోసం ఏర్పాటు చేసిన సభలో బడిపిల్లలను కూర్చోబెట్టి పవన్ పెళ్లిళ్లు, వారాహి వాహనం గూర్చి మాట్లాడటం చూస్తుంటే అతనికి విజ్ఞత, నైతికత లేదని అర్థమవుతోందన్నారు. పవన్ ప్రజలకు దత్తపుత్రుడైతే, జగన్మోహన్‌రెడ్డి చెంచలగూడా జైలుకు, సిబిఐకి దత్తపుత్రుడని ఎద్దేవాచేశారు.

గంగవరం పోర్టులో రూ.1800 కోట్లు విలువచేసే ప్రభుత్వ వాటా (11శాతం) కేవలం 490 కోట్లుకు అదానికి అమ్మటం ద్వారా 1100కోట్లు ప్యాకేజీ తీసుకొని ప్రభుత్వం సంపదను జగన్మోహన్‌రెడ్డి దోసుకున్నారని ఆరోపించారు. అధికారం చేపట్టిన జగన్మోహన్‌రెడ్డి పోలవరం పూర్తి చేయలేకపోయారని, సుజల స్రవంతి ప్రారంభించ లేకపోయారని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా తేలేకపోయారని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు సహకరిస్తున్నట్లు స్పష్టమవుతుందన్నారు ప్రతిపక్షాలపై విమర్శలు మాని, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని హితవుపలికారు.

పాపాహోం చిన్నారులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 31వ వార్డు పరిధి పోలీస్ బ్యారెక్స్ వద్ద గల పాపాహోమ్‌లో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు వైసిపి నాయకులు సీతంరాజు సుధాకర్ సహకారంతో వార్డు వైసిపి అధ్యక్షులు బత్తిన నాగరాజు, పార్టీ ఇన్‌ఛార్జి బత్తిన నవీన్ కుమార్ పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులకు అల్పాహారం కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శంకరరావు, త్రిమూర్తులు, రాజేష్, జితేంద్ర, లక్ష్మణ్ పాల్గొన్నారు.

48వ వార్డులో గంకల విస్తృత పర్యటన

ప్రజాశక్తి-సీతమ్మధార : గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో భాగంగా 48వ వార్డు కార్పొరేటర్ గంకల కవితఅప్పారావు గురువారం వార్డులో విస్తృతంగా పర్యటించారు. ఇందిరానగర్3, ఇందిరానగర్-4, ఎస్ఆర్ కాలనీ, బాపూజీనగర్, రామకృష్ణనగర్, నీలకంఠనగర్, శ్రీనివాస్‌నగర్, జైభారత్ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. విద్యుత్ దీపాలు లేని చోట బల్బులు వేయించారు. ఈ సందర్భంగా గంకల కవితఅప్పారావు మాట్లాడుతూ, ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో ఫిర్యాదు చేయాలని కోరారు.

నేడు ఆటోనగర్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన

ప్రజాశక్తి -గాజువాక : విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం ఆటోనగర్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్నట్లు సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు తెలిపారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు చేపట్టే నిరసన కార్యక్రమంలో సిపిఎం సభ్యులు, సానుభూతిపరులు, సిఐటియు కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి -గోపాలపట్నం : పాత గోపాలపట్నంలో జగన్నాథ స్వామి నవరాత్రి మహోత్సవం సందర్భంగా శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యాన అన్న సమారాధన నిర్వహించారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో
తొలి ఏకాదశి పూజలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : జివిఎంసి 86వ వార్డు పరిధి లక్ష్మీపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామిని చందన అలంకరణ చేశారు. అర్చకులు ఉదయ్‌కుమార్ పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. తరంగిణి మహిళా భక్త బృందం ఆధ్వర్యాన పలు గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు యువి.రాజు, కెవిఎస్ఎన్.రాజు, కశ్లేపల్లి శ్రీనివాసరాజు, ఎ.సుబ్బరాజు, వాడపల్లి రామచంద్రవర్మ, ఎ.మదువర్మ, సతీష్, జి.రాజవెంకట సోమరాజు, బి.వరహాలబాబు, జి.శ్రీరామ్మూర్తి, కె.కనకఅప్పారావు, ఎస్.చంద్రశేఖరరావు, పి.నారాయణరాజు, గంగవరం గోపి పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌పై కాల్పులు, తులసికి బెదిరింపులపై..

దళిత, ప్రజా సంఘాల నిరసన

ప్రజాశక్తి-సీతమ్మధార : జర్నలిస్టు తులసిచందును చంపుతానని బెదిరింపులు, భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌పై కాల్పులను వ్యతిరేకిస్తూ విదసం ఐక్యవేదిక ఆధ్వర్యాన వివిధ దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ భవన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దళిత నేత బూసి వెంకటరావు మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి అండతోనే దేశం నలుమూలలా మనువాదులు రెచ్చిపోతున్నారని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యమా, తుపాకి రాజ్యమా అని ప్రశ్నించారు. బిజెపి ఏలుబడిలో నచ్చని వారిపై కాషాయ మూకల దాడులు పెరిగాయన్నారు. యుపిలో రౌడీయిజంపై ఉక్కు పాదం అని గొప్పలు చెప్పే సిఎం యోగి చిత్తశుద్ధి ఉంటే ఆజాద్‌పై కాల్పులు జరిపి దుండగులను నడి రోడ్డుపై ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్‌చేశారు. ఆజాద్ ప్రాణానికి ఏదైనా జరిగితే మోడీ పాలనపై దేశ వ్యాప్తంగా అంబేద్కరిస్టుల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. జర్నలిస్టు తులసిని వేధిస్తున్న వారిపై కేసిఆర్ సర్కారు కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్.వేమన, సోడదాసి సుధాకర్, పాక సత్యనారాయణ, ప్రొఫెసర్ జాన్, గోలమాల అప్పారావు, నిర్మల, సుజాత, కస్తూరి వెంకటరావు, దుర్గారావు, నూకరాజు, మద్ర చంద్ర శేఖర్, కె.ప్రసాదరావు, జి.రవికుమార్, సుదర్శన్, మధు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్నదళిత సంఘాల నాయకులు

ఎస్‌సిలకు విద్యుత్ సబ్సిడీ ఉన్నట్టా.. లేనట్టా?

ప్రజాశక్తి-పెందుర్తి : ఎస్‌సిలకు విద్యుత్ సబ్సిడీ ఉన్నట్టా, లేనట్టా అని శ్రామికనగర్ ఎస్‌సి, ఎస్‌టి సంఘం అధ్యక్షులు అప్పారావు, గౌరవాధ్యక్షులు అనంతలక్ష్మి ప్రశ్నించారు. శ్రామికనగర్‌లో సుమారు 15 దళిత కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, గతంలో సబ్సిడీ ఇస్తానని చెప్పడంతో ఎవరూ బిల్లులు కట్టలేదని తెలిపారు. ఒక్కసారిగా రూ.10 వేలు బకాయిలు చూపించి కట్టాలని అధికారులు ఒత్తిడి తేవడంతో బకాయిలు చెల్లించారని పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు ఏమవుతున్నాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యుత్ సబ్సిడీపై అధికారులను వివరణ అడిగినా సరైన సమాధానం చెప్పలేకపోతున్నారని అసహనం వ్యక్తం చేశారు దళితులకు సబ్సిడీ కొనసాగించాలని డిమాండ్‌చేశారు.

నేడు ఉద్యోగ విరమణలు

డాక్‌యార్డు నుంచి అప్పలనాయుడు

గుర్రు అప్పలనాయుడు దంపతులు

ప్రజాశక్తి -మాధవధార : నేవల్ డాక్ యార్డ్‌లో విధులు నిర్వహిస్తున్న గుర్రు అప్పలనాయుడు శుక్రవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. విశాఖపట్నం జిల్లా కె.కోటపాడు మండలం గొండుపాలెం గ్రామంలో 1963లో గుర్రు కన్నయ్య, సూరమ్మలకు అప్పలనాయుడు జన్మించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు కె.కోటపాడులోనే చదువుకున్నారు. 1980-82లో గాజువాకలోని న్యూ ఐటిఐ ప్రథమ బ్యాచ్‌లో ఎలక్ట్రిషియన్ ట్రేడ్ ట్రైనింగ్ పూర్తి చేశారు. 1983-84లో విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డులో అప్రెంటిస్ చేశారు. 1984లో నేవల్ డాక్‌యార్డులోని వెపన్ డిపార్ట్‌మెంట్‌లో హైలీ స్కిల్ వర్కర్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ చార్జిమ్యాన్‌గా ఉద్యోగ విరమణ చేస్తున్నారు. 1989లో వెంకట సత్యశివాణితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. కుమారుడు కేంద్ర ప్రభుత్వ సంస్థలో, కుమార్తె బ్యాంకులో పని చేస్తున్నారు.

నేవల్ డాక్‌యార్డులో సిఐటియులో చేరి యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై అనేక పోరాటాలు చేశారు. వెపన్ డిపార్ట్‌మెంట్‌లో కార్మికుల ప్రయోజనాల కోసం రెండేళ్లపాటు షాప్ కమిటీ సభ్యులుగా బాధ్యతలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ స్కీమ్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో తాను పాల్గొనడమే కాకుండా, కొత్తగా చేరిన కార్మికులను చైతన్య పరుస్తూ వారిని పోరాటాల్లో భాగస్వాములు చేసేందుకు ఎంతో కృషి చేశారు. ఆయన నివసిస్తున్న పట్టాభిరెడ్డి తోట ప్రాంతంలో యువజన సంఘంలో ఉంటూ అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. యువతీయువకులు చెడు అలవాట్లకు లోను కాకుండా సమాజం పట్ల అవగాహన కల్పిస్తుండేవారు. మంచి సమాజం కోసం విరాళాల రూపంలో చేయూతగా ఉండేవారు. ఉద్యోగ విరమణ అనంతరం సంఘ సేవా కార్యక్రమాలతో పాటు నూతన సమాజం కోసం కుటుంబ సభ్యులతో కలిసి పనిచేస్తానని, సేవా దృక్పథంతో జీవిస్తానని ఈ సందర్భంగా అప్పలనాయుడు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ నుంచి వగ్గెల రామారావు

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్ ప్లాంట్ డిప్యూటీ మేనేజర్ వగ్గెల రామారావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేస్తున్నారు. ఖమ్మం జిల్లా అశ్వరావుపేట సున్నంబట్టి గ్రామంలో 1963 వ సంవత్సరం జూన్ 7వ తేదీన రామారావు జన్మించారు. ఐదో తరగతి వరకు సున్నంబట్టి గ్రామంలోనూ, పదవ తరగతి వరకు అశ్వరావుపేటలోనూ విద్యనభ్యసించారు. అశ్వరావుపేటలో 1981-83లో ఐటిఐ పూర్తిచేశారు. 1984లో బిహెచ్‌పిలో అప్రెంటిషిప్ చేశారు. 1987 జులై 20న స్టీల్‌ప్లాంట్‌లో టెక్నీషియన్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. తర్వాత చార్జిమ్యాన్, ఫోర్‌మ్యాన్‌గా ప్రమోషన్లు పొందారు. ప్రస్తుతం డిప్యూటీ మేనేజర్ స్థాయికి చేరుకొని ఆ బాధ్యతల్లో ఉద్యోగ విరమణ చేస్తున్నారు. 1990 సంవత్సరంలో సిఐటియు సభ్యత్వం, 1991లో సిపిఎం సభ్యత్వం తీసుకున్నారు. ప్రస్తుతం పార్టీ సానుభూతిపరులుగా ఉన్నారు.

వగ్గెల రామారావు దంపతులు

కౌలు రైతు జగ్గారావు కుటుంబాన్ని ఆదుకోవాలి

బాధిత కుటుంబానికి ప్రజా సంఘాల నేతల పరామర్శ

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట గ్రామంలో అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్న పలమరశెట్టి జగ్గారావు కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి కోటేశ్వరరావు, నాయకులు డి.శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకులు డి.డి.వరలక్ష్మి తదితరులు గురువారం జగ్గారావు ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగ్గారావు కసింకోట గ్రామంలో మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని, ప్రభుత్వ బ్యాంకుల రుణాలు ఇవ్వకపోవడంతో ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేసి చెరుకు, వరి పండించారని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర లేక, అప్పులు తీర్చలేక వడ్డీల భారంతో కృంగిపోయారని, సొంత భూమి లేని జగ్గారావు ఈ అప్పులను ఎలా తీర్చాలో తెలియక ఈ నెల 12న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారని చెప్పారు. ఇరుగుపొరుగు రైతులు ఆయన్ను అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స చేయించారని, అనంతరం విశాఖ కేజీహెచ్‌కి తరలించారని పేర్కొన్నారు. పరిస్థితి విషమించి ఈ నెల 28న బుధవారం మరణించారని తెలిపారు.

అనకాపల్లి ఆర్డీవో, డిఎస్పి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ తదితర అధికారులు కసింకోట గ్రామాన్ని సందర్శించి ఆత్మహత్య చేసుకున్న జగ్గారావు కుటుంబం నుండి వివరాలు తీసుకోవాలని అప్పుల భారంతో ఆత్మహత్యకు గురైన వాస్తవాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వపరంగా రావలసిన నష్టపరిహారం రూ.7లక్షలు అందజేయాలని డిమాండ్ చేశారు. జగ్గారావు కుటుంబానికి సిసిఆర్సి కార్డు ప్రభుత్వం మంజూరు చేయలేదని, గత ప్రభుత్వ ఇచ్చిన ఎల్ఇసి కార్డు, గ్రామ వాలంటీర్ చెప్పిన వాంగ్మూలం ఆధారంగా కౌలు రైతుగా గుర్తించాలని కోరారు. వైసిపి ప్రభుత్వం తెచ్చిన సిసిఆర్సి చట్టాన్ని సవరించి భూ యజమాని ఆమోదంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. మరో కౌలు రైతు ఈ దుస్థితికి పాల్పడకుండా ఉండాలంటే గ్రామ సభ ద్వారా కౌలు రైతులు అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆత్మహత్య చేసుకున్న జగ్గారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రజా సంఘాల నేతలు

దుస్తులు పంపిణీ చేస్తున్న అతిథి దేవోభవ సంస్థ ప్రతినిధులు

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి -వడ్డాది : అతిథి దేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వడ్డాది ఎంపిపి స్కూల్‌లో జాతీయ గణాంక దినోత్సవం, బక్రీద్ సందర్భంగా విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గణితంపై వివిధ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. సంస్థ నిర్వాహకుడు ఆరిపాక కామేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలు సెల్ ఫోన్లు కంప్యూటర్లకు దూరంగా ఉండి లెక్కల సూత్రాలు, సిద్ధాంతాలపై దష్టి సారిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం పివి శేషగిరిరావు, వి వెంకటరావు పాల్గొన్నారు

నేడు విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పేరుతో దొడ్డిదారిన విద్యుత్ వినియోగదారులపై పెద్ద ఎత్తున భారాలను వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ శుక్రవారం అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీల నాయకులు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో సిపిఎం నాయకులు ఎ.బాలకృష్ణ, గంటా శ్రీరామ్, సిపిఐ నాయకులు రాజాన దొరబాబు, కోరిబిల్లి శంకరరావు, సిపిఐఎంఎల్ నాయకులు పి.ఎస్.అజయ్ కుమార్ మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ఇప్పటి వరకు సుమారు రూ.50వేల కోట్ల భారాలను ప్రజలపై మోపిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణలు, షరతులకు తలొగ్గి జగన్ ప్రభుత్వం ప్రజలపై ఇంత పెద్ద ఎత్తున భారాలు వేస్తోందన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపువల్ల చిన్న పరిశ్రమలు, పెట్రోలియం పరిశ్రమలు మూతపడే స్థితిలోకి వచ్చాయని, చేతివృత్తిదారులు దివాళా తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు స్మార్ట్ మీటర్ల పేరుతో రూ.17వేల కోట్ల భారాలు ప్రజలపై మోపుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

జగన్ హయాంలో దళితుల భవిష్యత్తు నాశనం

ప్రజాశక్తి-అనకాపల్లి : జగన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత దళితుల భవితను నాశనం చేయడానికి కంకణం కట్టుకున్నారని, దళితులను బానిసలుగా మార్చడమే జగన్ నిత్యం వ్యూహరచన చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు వైసిపి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దళితులు ఓట్లతో గెలిచి రాజ్యాంగబద్ధంగా దళితులకు దక్కాల్సిన నిధులను నవరత్నాలకు దారి మళ్లించి దళితులకు మొండిచేయి చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేష్, దళిత బిడ్డలకు కార్పొరేట్ విద్య అందించేందుకు చంద్రబాబు బెస్ట్ అవైలబుల్ స్కూల్ తీసుకొస్తే జగన్ రెడ్డి వాటిని రద్దు చేశారని తెలిపారు. ఎస్సీ సెల్ నాయకులు ఎలక మల్లిబాబు, పల్లి విలియం కేరి, మైలపల్లి పోతురాజు మాట్లాడుతూ ఈ నాలుగేళ్ల వైసిపి పాలనలో నిత్యం దళితులపై దాడులు, హత్యలు, దళిత మహిళలపై మానభంగాలు, భూదందాలు జరిగాయని తెలిపారు.

ఉపాధి హామీ పనుల్లో అక్రమాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని ఎర్రవరం గ్రామంలో ఉపాధి హామీ పనులలో అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఒప్పోవరం గ్రామ సచివాలయం టెక్నికల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ అఫీర్ ఎంపీడీవోకు గురువారం ఫిర్యాదులు చేశారు. గ్రామ వికెఆర్‌పి కొల్లాటి చిన్నారావు మస్టర్లు వేయడంలో ఎక్కువ చూపిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 67 మంది కూలీలు పనిచేస్తుండగా 82 మంది పనిచేస్తున్నట్లు రికార్డులు చూపించినట్లు తెలిపారు. పేమెంట్లు చేసే సమయంలో రూ.400 చొప్పున వసూలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయమై ఎంపీడీవో విజయలక్ష్మి వీఆర్వీ కె.చిన్నారావుకు మెమో జారీ చేశారు. ఆరోపణలకు తగిన సమాధానం ఇవ్వాలని ఆమె మెమోలో కోరారు.

పివిఎస్ఎన్ఎం.రాజును సత్కరిస్తున్న దృశ్యం

నిబద్ధత కలిగిన వ్యక్తి రాజు

- రిటైర్‌మెంట్ సభలో

యూనియన్ బ్యాంకు డిజిఎం నరేష్

ప్రజాశక్తి-పాడేరు

యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా పని చేసి రిటైర్ అయిన పివిఎస్ఎన్ఎం.రాజు నిబద్ధత కలిగిన వ్యక్తి అని ఆ బ్యాంకు విజయనగరం రీజియన్ డిజిఎం నరేష్ అన్నారు. రాజు రిటైర్‌మెంట్ ఫంక్షన్ స్థానిక మాధవాజు కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిజిఎం నరేష్ మాట్లాడుతూ రాజు సేవలు అమోఘమని, ఒకటి రెండు సార్లు ఆయన సేవల గురించి విన్నానని, ఇప్పుడు ప్రత్యక్షంగా చూశానని చెప్పారు. బ్యాంకు పట్ల ఎంతో నిబద్ధతతో పనిచేశారన్నారు. విజయనగరం రీజియన్ ఆఫీసర్స్ యూనియన్ సెక్రటరీ ఆడారి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాజు క్రమశిక్షణతో చేసే పనిని చూసి తాము చాలా నేర్చుకున్నామని చెప్పారు. ఎవరైనా ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అంటే వెనుకడుగు వేసేవారని, కాని రాజు తనే ముందుకొచ్చి బ్యాంకు అభివృద్ధికి ఎంత కృషి చేశారని తెలిపారు. ఎల్డీఎం రవితేజ, బ్యాంకు మేనేజర్ ఎల్ భానుచందర్, సిసి ఆఫీస్ నుంచి, ఐటిడిఏ పిఓ ఆఫీస్ నుంచి సంబంధిత అధికారులు, బ్యాంకు సిబ్బంది మేనేజర్ రాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సిబ్బంది, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

బకాయిలైనా చెల్లించండి.. తిండైనా పెట్టండి..

ఆకులు పట్టుకొని ఉపాధి హామీ కూలీల నిరసన

ఆకులు పట్టుకొని నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ కూలీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

తమకు కూలి బకాయిలైనా చెల్లించండి.. లేదంటే తిండైనా పెట్టండి.. అంటూ దేవరాపల్లిలో ఉపాధి హామీ కూలీలు ఆకులు పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ కూలీలకు నాలుగు వారాలుగా కూలి డబ్బులు చెల్లించలేదని చెప్పారు. దీంతో కూలీల కుటుంబాలు పస్తులతో ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మేట్లకు స్మార్ట్ ఫోన్లు, పారితోషికం ఇవ్వాలని, కూలీలకు పే స్లిప్‌లు ఇవ్వాలని, మంచినీరు, మజ్జిగ, మెడికల్ కిట్లు, టెంట్లు సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎండా కాలంలో ఏ పనులు దొరక్క వ్యవసాయ కూలీలు మొదలుకొని డిగ్రీ చదువుకున్న యువతీ, యువకుల వరకు ఉపాధి పనులకు వెళ తున్నారని, ఇటువంటి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కూలీలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వివిధ అలవెన్స్‌లు ఇవ్వాలని నిరసన

పరవాడ : ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు గతంలో మాదిరిగా పని ముట్లు డబ్బులు, సమ్మర్, ట్రావెలింగ్ అలవెన్స్‌లు చెల్లించాలని కోరుతూ మండలంలోని వాడచీపురుపల్లి గ్రామంలో చెరువు వద్ద ఉపాధి హామీ కూలీలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఆరు వారాలుగా కూలి డబ్బులు ఇవ్వక కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా బడ్జెట్లో కేటాయింపులు తగ్గించి పేదల పొట్టగొడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పార్వతి, వరహాలమ్మ, మౌనిక, వరలక్ష్మి, రమణమ్మ, అప్పల నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

మహిళల పాలిట కల్పవృక్షం జాగృతి

విశ్రాంత విసి ముర్రు ముత్యాల నాయుడు

ప్రజాశక్తి-సబ్బవరం

మహిళల పాలిట కల్ప వృక్షం జాగృతి స్వచ్ఛంద సంస్థ అని విశ్రాంత వైస్ ఛాన్సలర్ ముర్రు ముత్యాల నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని జాగృతి సంస్థ కార్యాలయంలో జరిగిన 28వ ప్రాతినిధ్య మహాజన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలతో నడుపుతున్న జాగృతి స్వచ్ఛంద సంస్థ దినదినాభివృద్ధి చెందడం అభినందనీయన్నారు. మరో విశిష్ట అతిథి విజయ నిర్మాణ్ కంపెనీ చైర్మన్ ఎస్.విజయకుమార్ సంస్థ వార్షిక నివేదికను ఆవిష్కరించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.30.33 కోట్ల టర్నోవర్‌తో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో 148 గ్రామాల్లో 278 కేంద్రాలతో 22 వేల మంది సభ్యులతో విజయవంతంగా ముందుకు సాగుతోందని తెలిపారు. సంఘం అధ్యక్షులు కోట్నీ అమ్మతల్లి నాయుడు మాట్లాడుతూ తమ సంస్థ 2022-23 సంవత్సరంలో రూ.17.25 కోట్ల నికర లాభం ఆర్జించిందని చెప్పారు. అనంతరం అధ్యక్షులుగా కోట్నీ అమ్మతల్లి నాయుడు, ఉపాధ్యక్షులుగా గుర్రం అప్పల నర్సమ్మ, ఎమ్‌డిగా కందర్ప సుజాత ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఈఓ మౌక్తిక, కన్సల్టెంట్ వివి. సుబ్రహ్మణ్యం, డిఏస్ ప్రసాద్, వి.సుధాకర్, డాక్టర్ ఎం.వసంత, సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న ముత్యాలనాయుడు, విజయ్‌కుమార్ తదితరులు

గోవాడ సుగర్స్‌ను అన్ని విధాలా ఆదుకుంటాం

- ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు
- ప్రభుత్వం ఇచ్చిన రూ.85 కోట్లు షేర్ క్యాపిటల్‌గా బదలాయింపు
- సమీక్ష సమావేశంలో మంత్రి అమర్‌నాథ్ వెల్లడి

ప్రజాశక్తి-చోడవరం

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. ఫ్యాక్టరీ స్థితిగతులపై సుగర్ ఫ్యాక్టరీ గెస్ట్ హౌస్‌లో కర్మాగారం పర్సనల్ ఇన్‌ఛార్జి, జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, సుగర్స్ కమిషనర్ వెంకటరావు, ఫ్యాక్టరీ ఎమ్‌డి వివిఎస్.నాయుడు తదితరులతో గురువారం మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. తర్వాత ప్లాంట్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం మంత్రి అమర్నాథ్ మీడియాతో మాట్లాడుతూ రైతులకు, ఉద్యోగుల జీతభత్యాలు, ఆయిలింగ్ ఖర్చులకు సుమారు రూ.14 కోట్లు చెల్లించాల్సి ఉందని, దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఫ్యాక్టరీ మిషనరీ రిపేర్లు ఖర్చులపై ఆడిట్ చేయిస్తున్నామన్నారు. గోవాడ ఫ్యాక్టరీ మనుగడకు ఇక్కడే ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, దీని ద్వారా వచ్చే ఆదాయంతో ఫ్యాక్టరీ స్వయం సమృద్ధి సాధిస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తుందని తెలిపారు. ఇప్పటికే ఈ ప్లాంట్ ఏర్పాటు కోసం పర్యావరణ అనుమతులు కోరామన్నారు. జగన్ ప్రభుత్వం ఇప్పటికే ఈ కర్మాగారానికి ఇచ్చిన సుమారు రూ.85 కోట్లను ఆ కంపెనీకి షేర్ క్యాపిటల్‌గా బదలాయించనున్నట్లు అమర్నాథ్ చెప్పారు.

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ చెరుకు పంట వల్ల పెద్దగా రాబడి లేకపోవడంతో రైతులు దీనిపై ఆసక్తి చూపించడం లేదన్నారు. దేశీయ మార్కెట్లలో చక్కర ధరల తరచూ హెచ్చు తగ్గుల నేపథ్యంలో చెరుకు క్రషింగ్ వల్ల ఫ్యాక్టరీలకు భారీ నష్టమే తప్ప లాభాలు రావడం లేదని చెప్పారు. అయినప్పటికీ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కార్మికులను, ఉద్యోగులను, రైతులను జగన్ ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, బుచ్చయ్యపేట జెడ్పిటిసి దొండ రాంబాబు, సుగర్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కె.భాస్కర్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో ధర్మశ్రీ, కలెక్టర్ తదితరులు

పాడి రైతుకు పశు బీమా అందజేత

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన పాడి రైతు జరిమిరెడ్డి రాముకు గురువారం హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కాండ్రపు శేషు చేతులమీదుగా రూ.40 వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ రాముకు చెందిన ఆవు కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిందని, పశువు బీమా పథకం ఈ సొమ్ము అందజేయడం జరిగిందని తెలిపారు. అన్ని డెయిరీల కంటే హెరిటేజ్ పాల రైతులు సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డి.కిషోర్, ఆర్.చిన్నరాము, ఆర్.వెంకట్, డి.అప్పలనాయుడు, డి.రాజులమ్మ, డి.నాయుడు, డి.సత్యం పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి

ప్రజాశక్తి అచ్యుతాపురం : జనసేన పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన నూతన కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీలోకి కొత్తగా చేరే వారిపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, నాయకులు బైలపూడి రామదాసు, టెక్కలి పరశు రాము, పైల రామనాయుడు, ఎం.శ్రీవేణి, నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- కె.కోటపాడు : అఖిల భారత కిసాన్ సభ పిలుపు మేరకు ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన శుక్రవారం విజయవాడలో జరుగు ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో ధర్నా పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు వ్యతిరేక నల్ల చట్టాలను పూర్తిగా రద్దు చేస్తామని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద రైతులు నిర్వహించిన ధర్నాలో ప్రధాని మోడీ లిఖితపూర్వంగా హామీ ఇచ్చి ఇంతవరకు అమలు చేయలేదని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని, విద్యుత్ సంస్కరణను రద్దు చేయాలని, పెరిగిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, వ్యవసాయ మీటర్లకు స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రక్రియను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, రైతు సంఘం నాయకులు వనము సూర్యనారాయణ, ఈశ్వర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : తుమ్మపాల విశాఖ డెయిరీ పాల సొసైటీ-1 డైరెక్టర్లుగా ఎన్నికైన పెంటకోట లక్ష్మి, గుద్దేటి లక్ష్మి గురువారం మాజీ సర్పంచ్, అన్నపూర్ణ పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి)ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లను అభినందించి దుస్సాలువతో సత్కరించారు. సొసైటీ అభివద్ధికి కృషి చేయాలని, సొసైటీ ఆస్తులను పరిరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షులు పెద్దిశెట్టి బదరీనాథ్, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మార్టూరు వెంకటరమణ, కార్యదర్శి దిమ్మల అర్జున పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం రైతులకు విత్తనాలను పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపేట వేస్తుందన్నారు. వరి విత్తనాలు 30 కేజీలు బస్తాకు రూ.300 వరకు సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ మాట్లాడుతూ బిపిటి 3291 (సోనామసూరి), బిపిటి 5204 (సాంబా మసూరి), ఆర్జీయల్ 2537 (శ్రీకాకుళం సన్నాలు), ఎంటియు 1064, ఎంటియు 1021 తదితర రకాల విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లోనే లభ్యమవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రామానాయుడు, మాజీ ఎంపీపీలు సబ్బవరపు ముత్యాల నాయుడు, ఉమామహేశ్వరరావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ విరోతి చిన్న అప్పలనాయుడు, కోటాన రాము, మెంబర్లు చీపురుపల్లి సూర్యనారాయణ, సబ్బవరపు బుజ్జి, కాసుబాబు, పిఎసిఎస్ చైర్మన్ కాపుశెట్టి శేషుబాబు, కర్రి బాబు, ఎంపీడీఓ రమేష్ నాయుడు, ఏఈవోలు బాలరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి అద్దంకి సత్యనారాయణ, వైసిపి నాయకులు లగిశెట్టి గణేష్, ఇందలి ముసలి నాయుడు, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభ నారాయణరావు, పాల సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, చిన్ని రాజీవ్, పాల్గొన్నారు.

అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణపై సమీక్ష

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి -అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురువారం సమీక్ష నిర్వహించారు. ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ (ఎడిబి) ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రవి పఠాన్‌శెట్టితో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. అనకాపల్లి అచ్చుతాపురం రోడ్డు విస్తరణ పనులపై మంత్రి మాట్లాడుతూ ఈ రోడ్డు రెండు నియోజకవర్గాలను, ఇండస్ట్రియల్ పార్కును కలుపుతుందని, ఈ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు ప్రయాణం చేస్తుంటాయని తెలిపారు. అత్యంత కీలకమైన ప్రతిష్టాత్మకమైన ఈ రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఏడిబి ప్రతినిధులను కోరారు. రోడ్డు విస్తరణకు సంబంధించిన భూ సేకరణ పనులు పూర్తయినట్లు చెప్పారు. నష్టపరిహారం కింద సుమారు 106 కోట్ల రూపాయలను చెల్లించవలసి ఉందని, ఈ మొత్తాన్ని నాలుగు విడతల్లో ప్రభుత్వం నుంచి తీసుకురానున్నామని తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే మొత్తంలో కొంత భాగాన్ని నష్టపరిహారానికి, మరికొంత భాగాన్ని రోడ్డు నిర్మాణానికి వినియోగించాలని సూచించారు. ఇందుకు ఏడిబి ప్రతినిధులు అంగీకరించారు.

నాలి గెడ్డకు మోక్షం

ఉపాధి హామీ ద్వారా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని చౌడువాడ గ్రామంలో గల నాలిగెడ్డకు మోక్షం కలిగింది. ఈ గెడ్డ పూడికపోవడం వల్ల ప్రతి ఏటా వందలాది ఎకరాలు వరి పంట ముంపునకు గురవుతూ కుళ్ళి పోతుంది. ఇటీవల కొంతమంది రైతులు ఎంపీడీవో కాండ్రేగుల శశిదేవి దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి 20 రోజుల్లో కాలువ పనులు ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో చేస్తామని చెప్పి వెంటనే చర్యలు చేపట్టారు. ఉపాధి హామీ కూలీలతో కాలువ అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు.

నాలి కాలువకు శారదా నది నుంచి, చిట్టగెడ్డ నుంచి నీరు వస్తుంది. కాలువ ద్వారా నీరు సుమారుగా రెండు కిలోమీటర్లు ప్రవహించి మరల చిట్టగెడ్డలోనే కలుస్తుంది. కాలువలో చాలా కాలంగా పూడిక తీయకపోవడం, రైతులు చెరుకు చెత్త, తుప్పలు డొంకులు నరికి ఈ కాలువలో వేయడం వల్ల ఏమాత్రం వర్షం పడిన ఈ కాలువ గుండా నీరు ప్రవహించడానికి వీల్లేక పక్క పొలాలను ముంచేస్తుంది. కాలువకు ఇరువైపులా ఎక్కువగా రైతులు వరి పంటను సాగు చేస్తూ ఉంటారు. కాలువ నీరు ఎక్కువ అయినచో ఆ పంట నీట మునిగి పూర్తిగా దెబ్బతింటూ ఉంటుంది. ఈ కాలువ మరమ్మతులు చేపట్టాలని ఎన్నో ఏళ్లుగా ఎంపీడీవోకి, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులకు మొరపెట్టుకున్నా ఏ ఒక్కరూ ఇంతవరకు పట్టించుకోలేదు. ప్రస్తుత ఎంపిడిఒకు విన్నవించిన వెంటనే మరమ్మతు పనులు చేపట్టడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో శశిదేవికి చౌడువాడ, మల్లంపాలెం గ్రామాల రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

నాలి గెడ్డలో తుప్పలు, పూడిక తీస్తున్న ఉపాధి హామీ కూలీలు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - యలమంచిలి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి పౌరుడు తనకున్న స్థలం మొక్కలు వాటిని సంరక్షించాలని రేగుపాలెం సర్పంచ్ రాజాన మహాలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని రేగుపాలెంలో ఎస్ఆర్‌డిఎస్ జిల్లా ప్రత్యేక అధికారి కె.పార్థసారధి క్లస్టర్ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం రేగుపాలెం పంచాయతీ తిరుమల చెరువు వద్ద మొక్కలు నాటారు.

సుస్థిర అభివృద్ధికి గణాంక సూచికలు

ప్రజాశక్తి-అనకాపల్లి : సుస్థిర అభివృద్ధి సాధించడానికి జాతీయ సూచికలతో అనుసంధానం తప్పనిసరని జిల్లా అర్ధగణాంక శాఖ అధికారి రామారావు పేర్కొన్నారు. కలెక్టరేట్ జిల్లా అర్ధగణాంక శాఖ కార్యాలయంలో రామారావు ఆధ్వర్యంలో ప్రొఫసర్ మహలనోబిస్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "సుస్థిర అభివృద్ధి సాధించటానికి జాతీయ సూచికలతో రాష్ట్ర సూచికలను అనుసంధానం చేయడం ఎంతో ఆవశ్యకమని చెప్పారు.

పాల సొసైటీ డైరెక్టర్ల ఎన్నిక

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారం విశాఖ డెయిరీ పాల సొసైటీ డైరెక్టర్లుగా గొంతిన పైడిరాజు, పెచ్చెట్టి రాజు గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాల సొసైటీ అధ్యక్షులు సియాద్రి లక్ష్మణరావు విశాఖ డెయిరీ అందిస్తున్న సబ్సిడీ రుణాలు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం అధ్యక్షులు లక్ష్మణరావు ఆర్థిక సహాయంతో పాల ఉత్పత్తిదారులకు పాలు కాచుకునే గిన్నెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వేతన కార్యదర్శి గొర్లి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ బొబ్బరి కన్నారావు, మాజీ ఎంపీటీసీ అక్కిరెడ్డి రామలక్ష్మి దుర్గి నాయుడు, పాల సొసైటీ మాజీ అధ్యక్షుడు కోన సత్యనారాయణ, ఉప సర్పంచ్ రాపర్తి అరుణ ముత్యాల నాయుడు, అక్కిరెడ్డి అచ్చిబాబు, చిన్నయుడు, సోమేశ్వరరావు, నూకరాజు, రాము, చిన్నారావు, అప్పారావు, జి.చిన్నారావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముత్యాలరావుకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-సబ్బవరం : జివిఎంసి 88వ వార్డు వైసిపి యూత్ అధ్యక్షుడు బొట్ట ముత్యాలరావును పెందుర్తి ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్ గురువారం పరామర్శించారు. ఇటీవల కుమార్తెను కోల్పోయి దుఃఖ సాగరంలో ఉన్న ముత్యాలరావును వెదుళ్ళనరవలోని ఆయన స్వగృహానికి ఎమ్మెల్యే వెళ్లి ఓదార్చి ధైర్యం చెప్పారు. వైసిపి నాయకులు, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

ఎన్‌టిపిసి సింహాద్రిలో హాట్ గ్యాస్ ఉత్పత్తి

ప్రజాశక్తి-పరవాడ : ఎన్టీపీసీ సింహాద్రి యూనిట్-4లో గురువారం 300 ఎమ్‌డెబ్ల్యూ యూనిట్ లోడ్‌తో పనిచేస్తున్నప్పుడు బూస్టర్ ఫ్యాన్, రీసర్క్యులేషన్ పంపులు, సహాయక వ్యవస్థల సహాయంతో ఎఫ్‌జిడి హాట్ గ్యాస్‌ను ఉత్పత్తి చేసింది. ఈ కార్యక్రమంలో సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్ సంజయ్ కుమార్ సిన్హా, జిఎం ఓడిపి పాత్ర, ప్రాజెక్టు జిఎం సంతోష్ కుమార్, జిఎం ఎంఎం మాథ్యూ, కోవూరు జిఎం ఆపరేషన్ టిఆర్ రాజగోపాలన్, జిఎమ్ కె జగన్మోహనరావు, జిఎమ్ పిఎస్ ఎస్ పద్మప్రియ, హేచ్ఓ హెచ్ఆర్ రుమా డి శర్మ, పాల్గొన్నారు.

జగన్నాథ స్వామి తిరుగు రథయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జగన్నాథ స్వామి వారి తిరుగు రథయాత్ర కార్యక్రమం గురువారం ప్రారంభించారు. అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి, డాక్టర్ విష్ణుమూర్తి దంపతులు, వైసిపి నాయకులు దాడి రత్నాకర్ పాల్గొని బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సుమారు 5వేల మందికి ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథం మీద ఆసీనులను చేసి తిరుగు రథయాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 83వ వార్డు కార్పొరేటర్ జాజుల లక్ష్మి ప్రసన్న, వైసిపి నాయకులు జాజుల రమేష్, పీలా రాంబాబు, దాడి ఈశ్వరరావు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథస్వామి పండగ

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక గవరపాలెం గంగిరావి చెట్టు వద్ద ఎల్లపు వారి కుటుంబాల ఆధ్వర్యంలో జగన్నాథ్ స్వామి వారి పండగను 108 కుండలతో గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో పాల్గొన్న టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కోడలు పీలా అనూష ఘటాన్ని ఎత్తుకొని పండుగను ప్రారంభించారు. ఎల్లపు జగన్నాథరావు, ఎల్లపు గోవింద్, ఎల్లపు దివాకర్, ఎల్లపు శ్రీను, కిరణ్, పాల్గొన్నారు.

రైతు సంఘం నేత గృహనిర్బంధం

పోలీసు అదుపులో అప్పలరాజు

ప్రజాశక్తి- ఎస్ రాయవరం : ఈనెల 30న విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు వెళ్లకుండా రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పల రాజును గృహ నిర్బంధం చేశారు. మండలంలోని ధర్మవరం అగ్రహారంలో అతని స్వగృహంలో పోలీసులు నిర్బంధించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ తీవ్రమైన సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి, కష్టాలలో ఉన్న రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు చేపట్టే ధర్నాకు వెళ్లనీయకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. రైతు సంక్షేమ ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటూ, రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై ఆందోళనకు పిలుపునిస్తే వెళ్ల కుండా అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరని, విజయవాడలో రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నాను విజయవంతంగా జరుగుతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

కోటవురట్ల మసీదులో ముస్లిముల ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి -కోటవురట్ల: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను గురువారం ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంలోని రెండు మసీదుల్లో ముస్లిం సోదరులు పవిత్ర బక్రీద్ ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. నమాజ్ నిర్వహించారు, అనంతరం మక్కా మసీదు వద్ద గొర్రెలను బలిచ్చి అన్నసమారాధన నిర్వహించారు, కార్యక్రమంలో ఖాసిం మాస్టారు, ఇస్మాయిల్, అబ్దుల్లా, కరీం, సహ పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలోని ముస్లిం గ్రామాల్లో గురువారం బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు పెద బోదిగల్లం ఈద్గా వద్ద ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రార్థన చేశారు .ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

కలెక్టరేట్ : ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించే బక్రీద్ పండగను విశాఖ నగరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉమెన్స్ కాలేజ్ ఎదురుగా సెంట్రల్ పార్కు ఆవరణలో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈద్ నమాజ్ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు హైదర్ అలీ సింకా మీడియాతో మాట్లాడుతూ విశాఖ జిల్లాలో 5 లక్షల మంది ముస్లింలు ఉన్నారని గుర్తు చేశారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు సద్వినియోగమయ్యేలా చూడాలన్నారు. 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక బక్రీద్ అన్నారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు మహ్మద్ రహంతుల్లా, షేక్ అహ్మద్ అలీ, మహబూబ్ అలీఖాన్, మీర్ అబ్బాస్ హుస్సేన్, షేక్ అబ్దుల్ మునీర్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల పండగలు

ప్రజాశక్తి-ఎస్ రాయవరం : మండలంలో సర్వసిద్ధి రాయవరం గ్రామదేవతల పండగలు ఘనంగా జరిగాయి రాయవరంలో బంగారం తల్లి పండుగ, సర్వసిద్ధి గ్రామంలో సిద్దేశ్వరమ్మ తల్లి పండుగ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవార్లకు పసుపు కుంకుమలు సమర్పించారు. సర్వసిద్ధి గ్రామంలో కోలాటాలతో అమ్మవారిని ఊరేగించారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు

ఏం కొనేటట్టు లేదు ...ఏం తినేటట్టు లేదు!

కొండెక్కిన కూరగాయల ధరలు
సామాన్యులకు అందుబాటులో లేక చిక్కులు

మార్కెట్లో ఉన్న కూరగాయలు

ప్రజాశక్తి- మాడుగుల : అమాంతంగా పెరిగిన కూరగాయల ధరలతో సామాన్యులకు చుక్కలు కనబడుతున్నాయి. నిన్నమొన్నటి వరకు కోడి మాంసం ధరలు సామాన్యులకు అందుబాటులో లేని విధంగా అమాంతం పెరగగా, ఇప్పుడు కూరగాయల పరిస్థితి కూడా అలాగే తయారైంది. నిన్న మొన్నటి వరకు కిలో రూ.20లకే దొరకే టమోటా ఏకంగా ఐదింతలు పెరిగి రూ.100 కు చేరింది. పచ్చి మిర్చి పూటెక్కి ఎప్పుడో రూ.100 దాటేసింది. ఇక అల్లం, వెల్లుల్లి ధరలు సైతం సామాన్యులకు అందుబాటులో లేనంతగా పెరిగాయి. బీన్స్, బీర, కాకర, తదితర కూరగాయలు ధరలు రూ.80 నుండి రూ.100 కు చేరాయి. ఇతర అనేక రకాల కూరగాయల ధరలు పెరిగాయి. స్థానికంగా లభించే బెండ, వంకాయ, దొండ వంటి రకాలతో పాటు, బంగాళా దుంపల ధరలు మాత్రం కాస్త అందుబాటులో వున్నాయి. ఆకు కూరలు ధరలు సైతం అమాంతంగా పెరిగాయి. నెల రోజులు ముందు కోడి మాంసం ధర కూడా అమాంతంగా పెరిగింది కిలో 300 దాటడం అనేక సంవత్సరాల తరువాత ఇదే మొదటి సారి. ప్రస్తుతం చికెన్ ధరలు కాస్త తగ్గినప్పటికీ, కూరగాయల ధరలు మాత్రం ఆకాశాన్నంటాయి. జూన్ మొదటి వారంలో ఎండలు ఎక్కువగా కాయడం, వర్షాలు లేకపోవడం తదితర కారణాలతో ధరలు పెరిగినట్టు వ్యాపారులు చెపుతున్నారు.

మొక్కుబడి తంతుగానే గడపగడపకూ...

గడపగడపలో పాల్గొన్న ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి-కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలో మొక్కుబడి తంతుగానే సాగుతోంది. పక్షం రోజులుగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు రోజుకో సచివాలయం పరిధిలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా, సమస్యల సమీకరణను అయిందనిపిస్తున్నారు. కైలాసపట్నం గ్రామంలో గురువారం రెండవ రోజు కార్యక్రమం నిర్వహించారు. సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయిస్తుండడంతో ఒక్కో సచివాలయం పరిధిలో రెండు, మూడేసి గ్రామాలు ఉండడం, ఆయా గ్రామాల్లోతాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, ఇతరత్రా సమస్యలుండడంతో అరకొర నిధులతో ఏం పనులు చేయాలో తెలుల పట్టుకుంటున్నారు. కైలాసపురంలో వైసిపిలో రెండు వర్గాలుండగా, ఒక వర్గం గైర్హాజరు కావడంతో మరోమారు విభేదాలు బహిర్గతమయ్యాయి. ఎమ్మెల్యే పాల్గొంటున్న కార్యక్రమానికి కొందరు నేతలు డుమ్మా కొట్టడం చర్చనీయాంశమైంది. అంతేకాక ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులకు రిఫర్ చేసి, చేయమని ఆదేశించడమే తప్ప, పనులు జరిగే పరిస్థితి కనిపించడం లేదు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉమాదేవి, మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు, ఉప సర్పంచ్ సిద్ద బత్తుల నాగేశ్వరరావు, ఎంపిటిసి వెంకటరమణ, కోటఉరట్ల సర్పంచ్ అనిల్ కుమార్, సర్పంచ్ శివరామ్, సిహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హైకోర్టు స్టేపై కౌంటరు దాఖలు చేస్తాం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం ప్రధాన రహదారి విస్తరణకు భవన యజమానులకు ఇచ్చిన నోటీసులపై హైకోర్టు స్టే ఇచ్చినందున, కోర్టు ఉత్తర్వుల మేరకు నడుచుకుని తదుపరి చర్యలు చేపడతామనినర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ కనకారావు తెలిపారు. విస్తరణ నోటీసులపై హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ కనకారావు, 15వ వార్డు కౌన్సిలర్, న్యాయవాది మాకిరెడ్డి బుల్లి దొర వేర్వేరుగా స్పందించారు.

కమిషనర్ కనకారావు మాట్లాడుతూ, కోర్టు ఆదేశాలను గౌరవిస్తామన్నారుఉ. కౌన్సిలర్, న్యాయవాది మాకిరెడ్డి బుల్లి దొర మాట్లాడుతూ, రోడ్డు విస్తరణ పనులలో భాగంగా భవన యజమానులకు ఇచ్చిన నోటీసులపై హైకోర్టు స్టే ఇచ్చిందని, కోర్టు ఆదేశాలను గౌరవిస్తూనే, దీనిపై కౌంటర్ దాఖలు చేస్తామని బుల్లిదొర తెలిపారు. మున్సిపాలిటీ, నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష మేరకు రోడ్డు విస్తరణకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. పట్టణ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని వంద అడుగులకు రోడ్డు విస్తరణ చేపట్టాలని కౌన్సిల్‌లో ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్వయంగా గత ఏడాది డిసెంబర్లో రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేసి, నిధులు మంజూరు చేశారన్నారు. విస్తరణకు సంబంధించి భవన యజమానులకు జారీ చేసిన నోటీసులపై మాత్రమే హైకోర్టు స్టే ఇచ్చినట్లు తెలిపారు. రోడ్డు విస్తరణ ప్రక్రియ ఆపాలని కోర్టు ఎక్కడా ఆదేశించలేదన్నారు. కోర్టు ఆదేశాలను గౌరవించి వారం రోజుల్లో హైకోర్టులో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి
ఆడారి కృషి అభినందనీయం


పాలకేంద్రం భవనం ప్రారంభిస్తున్న ముత్యాల నాయుడు

ప్రజాశక్తి - మాడుగుల : పాడిరైతులు, ప్రజల సంక్షేమానికి విశాఖ డెయిరీ పూర్వ ఛైర్మన్ ఆడారి తులసీరావు బాటలోనే అతని తనయుడు ప్రస్తుతం ఛైర్మన్ ఆనందకుమార్ కృషి చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. గురువారం మండలంలోని వంటర్లపాలెం గ్రామంలో విశాఖ డెయిరీ నిధులు రూ.4.5 లక్షలతో నిర్మించిన నూతన పాలఉత్పత్తిదారుల సంఘ భవనాన్ని ఆనందకుమార్‌తో కలిసి ఉపముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పార్టీ రైతుల జీవనోపాధికి విశాఖ డెయిరీ ఎంతో కృషి చేస్తోందన్నారు. విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ పాడి రైతుల పట్ల ప్రేమ, నిబద్ధత స్వర్గీయ తులసిరావుకు ఉండేవని, తన తండ్రి స్ఫూర్తితో డెయిరీ అభివృద్ధికి, సభ్య రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తానన్నారు. పెద్ద ఎత్తున వైసిపి నేతలు పాల్గొన్నారు

2న యాదవ ప్రతిభావంతులకు పురస్కారాలు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : యాదవ కులంలో పుట్టి పదవ తరగతి, ఇంటర్మీడియేట్‌లలో విశేష ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు వచ్చేనెల 2న అనకాపల్లిలో యాదవ సంఘ ఆధ్వర్యంలో జిల్లాసంఘం ద్వారా పురస్కారాలతో పాటు ప్రోత్సాహకాలను అందించనున్నట్లు విశాఖ జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు భరణికాన బాబూరావు తెలిపారు.. గురువారం యస్ రాయవరం మండలం కొనవానిపాలెంలో యాదవ సంఘ సభ్యులతో సమావేశమయ్యారు. యాదవ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు ఈ పురస్కారాలను అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రతిభావంతులను గుర్తించే దుకు పర్యటిస్తున్నామన్నారు. జిల్లా సంఘ సభ్యులు భరణికాన నర్సింహమూర్తి, ధూళి రంగనాయ కులు, వియ్యపు సింహాచలం, కోరాడ శ్రీను, పాయకరావుపేట నియోజకవర్గ అధ్యక్షుడు కోన అప్పలరాజు, నక్కపల్లి మాజీ జెడ్‌పిటిసి కురందాసు నూకరాజు, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, ధూళి శ్రీను, వియ్యపు వరహాలు, దార బోయిన సత్యన్నారాయణ, బొట్టా వరహాలు, బొట్టా రాంబాబు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఏకాహం

ప్రజాశక్తి -ఎస్ రాయవరం :తొలి ఏకాదశిని పురస్కరించుకొని కొరుప్రోలు సీతారామ స్వామి ఆలయంలో ఏకాహం నిర్వహించినట్లు ఆలయ ట్రస్ట్ యరమాటి సూరిబాబు తెలిపారు. గురువారం ఉదయం ఆరుగంటలకు స్వామి చిత్రపటంతో తిరువీధి నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి సుదర్శనం నారాయణాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఏకాహం భజనకు హార్మోనియం చోడిశెట్టి అప్పారావు డోలక్ ఎ.కృష్ణ సహకారం అందించగా, కొరుప్రోలు సీతారామ భజన బృందం పాల్గొంది.

శిథిలావస్థలో రాజుపేట రహదారి

- క్వారీ లారీలతో రోడ్డు అధ్వానం
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకునే నాథుడే కరువు

నీరు నిండిన గోతులతో రాజుపేట రహదారి

ప్రజాశక్తి -కోటవురట్ల: రాజుపేట రహదారి అధ్వానంగా తయారవడంతో ఆయా ప్రాంత వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డు శిథిలావస్థకు చేరుకున్నా గడిచిన నాలుగేళ్లుగా కనీసం పట్టించుకునే నాధుడు లేడని గ్రామస్తులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సమీపంలోని నల్ల పిక్క క్వారీ నుంచి రేయింబవళ్లు తేడా లేకుండా భారీ వాహనాలు నిత్యం పరిమితికి మించి అధిక లోడుతో ప్రయాణించడం ప్రధానరహదారి శిథిలావస్థకు కారణమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలతో నిత్యం దుమ్మూధూళి రేగి, ఇబ్బంది పడుతున్నామని, ఏక్షణాన ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన ప్రజల్లో ఉందని పలువురు అంటున్నారు.

మండలం నుండి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి శిథిలావస్థకు చేరుకోవడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ప్రమాదాలు ం చోటుచేసుకున్న ఘటనలున్నాయి, పి రామన్నపాలెం, జంగాలపల్లి, రాజుపేట, కైలాస పట్నం వెళ్లే వరకు ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో కనీసం నడిచి వెళ్లేందుకు కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది, ఇటు అధికారులు గానీ, అటు నాయకులు గానీ కనీసం రోడ్డు వైపు కన్నెత్తి చూడలేదని ఈ ప్రాంత వాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భారీ లోడుతో నిత్యం రాకపోకలు సాగిస్తున్న క్వారీ లారీలను ఈ మార్గంలో నియంత్రించాలని, పాడైన రోడ్డును పునర్నిర్మించి, ప్రజల రాకపోకల కష్టాలకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

గిరి ప్రదక్షిణలో ప్లాస్టిక్ నిషేధం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జూలై 2న జరిగే గిరి ప్రదక్షిణలో పూర్తిగా ప్లాస్టిక్‌ను నిషేధించినట్టు జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ తెలిపారు. నగరపాలక సంస్థలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలపై గురువారం ఉదయం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. గిరి ప్రదక్షిణకు ఇప్పటికే పలు ఎన్‌జిఒ సంస్థలతో మాట్లాడి విస్తృత ఏర్పాట్లు చేశామని అన్నారు. గిరి ప్రదక్షిణ దారి పొడుగునా మంచి నీరు, టాయిలెట్లు, డస్ట్‌బిన్లు, వైద్య శిబిరాలు అందుబాటులో ఉంటాయని, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్స్ లేదా ప్లాస్టిక్ కవర్‌లలో ప్రసాద వితరణ చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు అంతేకాకుండా గిరి ప్రదక్షిణలో ప్లాస్టిక్ వినియోగించే వారిపై తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జివిఎంసి పరిధిలోని పది బృందాలు వీటిపై ముమ్మర తనిఖీలు నిర్వహిస్తాయన్నారు. జివిఎంసి పరిధిలో ఖాళీగా ఉన్న 482 పారిశుధ్య కార్మికుల పోస్టుల నియామకాల్లో ఇప్పటికే 119 అభ్యర్థుల నియామకాలు పూర్తయ్యాయని, మిగిలిన వాటి భర్తీకి చర్యలు తీసుకుంటామని అన్నారు. విశాఖపట్నం సమగ్ర పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టిన ఎకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా నగర విద్యార్థులకు జూలై 1 నుంచి పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

'పోలవరం పోరుకేక'కు సిఐటియు మద్దతు

'పోలవరం పోరుకేక' మహాపాదయాత్రలో పాల్గొన్న సిఐటియు విశాఖ జిల్లా నేతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 20 నుంచి జూలై 4 వరకూ నెల్లిపాక నుంచి విజయవాడ వరకూ తలపెట్టిన పోలవరం పోరుకేక మహాపాదయాత్రకు సిఐటియు విశాఖ జిల్లా కమిటీ మద్దతు తెలుపుతున్నట్టు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ప్రకటించారు. దీనికి సంఘీభావంగా గురువారం పాదయాత్రలో విశాఖపట్నం సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు. కారుటూరు కాలనీలు, ములగలంపల్లి కాలనీలు, రెడ్డి గణపవరం గ్రామాల్లో పోలవరం నిర్వాసితులతో కలిసి పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బి.జగన్, నాయకులు నారాయణ, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు బి.తౌడన్న, కోటి, వీరాస్వామి, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

సేకరించిన భూముల పరిశీలన

మ్యాప్ సాయంతో భూములను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -నక్కపల్లి :వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఎపిఐఐసి తీర ప్రాంతాల్లో సేకరించిన భూములను అధికారులు పరిశీలించారు. తీర ప్రాంత గ్రామాలైన రాజయ్యపేట, బోయపాడు తదితర ప్రాంతాల్లో ఎపిఐఐసి అధికారులు కిషోర్, పద్మజ, దేవి, ఆర్‌డిఒ జయరాం , ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ ప్రతినిధులు పర్యటించారు. భూమి ఎంత సేకరించారు తదితర అంశాలను మ్యాప్ ద్వారా పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పలువురు రైతులు ప్యాకేజీ పూర్తిస్థాయిలో చెల్లించలేదని అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలోనే వాటిని చెల్లిస్తామని అధికారులు తెలిపారు..

జగనన్న సురక్షను జయప్రదం చేయాలి

సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి- నక్కపల్లి : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్‌డిఒ జయరాం అన్నారు .మండలంలోని కాగిత సచివాలయాన్ని సందర్శించారు. వచ్చేనెల ఒకటి నుంచి నిర్వహించునున్న జగనన్న సురక్షపై అధికారులు, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కన్వీనర్లతో సమీక్షించారు. ఇంటింటా సర్వే, టోకెన్లు, సర్వీసెస్, సర్టిఫికెట్లు తదితర అంశాలపై వివరించారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలపై నిర్లక్ష్యం చేయరాదన్నారు. వేంపాడు సచివాలయాన్ని ఎంపిడిఒ సీతారామరాజు సందర్శించారు.

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష పథకం విజయవంతం చేయాలని ఆర్‌డిఒ వెంకట జయరాం సిబ్బందికి సూచించారు, గురువారం చౌడువాడ సచివాలయంలో జగనన్న సురక్ష పనితీరును పరిశీలించారు. మండలంలో సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు, ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు మాట్లాడుతూ,కోటవురట్లలో రెండు సచివాలయాలు, రాజుపేట, చౌడువాడ, సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరించగా గురువారం నుండి పందూరు గ్రామంలో దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు తెలిపారు, కోటవురట్ల రెండు సచివాలయాల్లో 330, రాజుపేట 125, చౌడువాడ 140, పందూరు 4 మంది వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాహశీల్దారు జానకమ్మ పాల్గొన్నారు

పంజాబ్ నేషనల్ బ్యాంకు బ్రాంచి ప్రారంభం

బ్రాంచి ప్రారంభిస్తున్న జోనల్ మేనేజర్ శ్రీవాత్సవ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పంజాబ్ నేషనల్ బ్యాంకు విశాఖపట్నం సర్కిల్ పరిధిలో తన 66వ శాఖను కొత్తవలసలో గురువారం ప్రారంభించింది. బ్యాంకు జోనల్ మేనేజర్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో విశాఖపట్నం బ్యాంకు సర్కిల్ హెడ్ డిజిఎమ్ వి.నీలిమ, బ్రాంచి మేనేజర్ ఎస్.చైతన్య పాల్గొన్నారు. ఈ బ్రాంచ్‌లో అన్ని రకాల బంగారు, ఇంటి, కారు రుణాలు లభిస్తాయని బ్యాంకు అధికారులు తెలిపారు.

వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి- నక్కపల్లి : ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో గురువారం తొలి ఏకాదశి పురస్కరించుకొని భక్తుల రద్దీతో కిటకిటలాడింది. కొండపై వెలసిన వెంకన్న మూలవిరాట్‌ను, కొండ దిగువన ఉత్సవమూర్తులను భక్తులు దర్శించుకున్నారు .

ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల ప్రసాద్ ఆచార్యులు, అర్చకులు కష్ణమాచార్యులు, శేషాచార్యులు, రంగాచార్యులు భక్తులకు దర్శనాలు చేయించి, తీర్థప్రసాదాలను అందజేశారు. స్వామిని దర్శించుకున్న వారిలో పలువురు రాజకీయ నేతలు, అధికారులు ఉన్నారు. సాయంత్రం శ్రీనివాస భక్త సమాజ భజన బందం ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపిస్తూ గిరి ప్రదక్షణ నిర్వహించారు